## చరిత్ర

# రిజర్వేషన్లు :చట్టం, కోర్టులు

వెనుకబడ్డ వర్గాలకు షెడ్యూల్డు కులాలకూ ఇచ్చే రిజర్వేషన్ల పైన వివాదం చాలాకాలం కోర్టులకు పరిమితమయి వుండింది. ఈ మధ్యనే ఇది రాజకీయ సమస్య అయింది. గుజరాత్ రాష్ట్రంలో ఇది పెద్ద ఎత్తున గొడవకు దారితీసింది. అటుపిమ్మట జరిగిన రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాలు గుజరాత్ వుద్యమాన్ని నమూనాగా స్వీకరించాయి. ఆ వుద్యమం హింసాత్మకంగా సాగినప్పటికి మన అహింసాత్మకమయిన సంస్కృతి అహింసను మౌనంగా సహించింది.

ఈ మధ్య మన రాష్ట్రంలోను అటువంటి వుద్యమమే నడిచింది. ఆ వుద్యమం చాలా క్రమ శిక్షణతో నడిచిందని అందరూ మెచ్చుకున్నారు. ఈ మెప్పు ఇచ్చిన వాళ్లు మరచిపోయే విషయం ఏమిటంటే అధికార యంత్రాంగాన్ని నడిపే వాళ్లంతా అగ్రవర్ణాల వాళ్ళుకావడంతో ఇక్కడసలు సంఘర్షణకు తావులేదు. రాస్తారోకోలు, పికెటింగ్‌లు, బస్సుల విధ్వంసనం, అన్నీగూడ పోలీసుల పర్యవేక్షణలో ప్రశాంతంగా సాగాయి. వెనుక బడిన వర్గాలు బంద్‌పిలుపు

యిచ్చినప్పుడు వాళ్లతో అదే విధంగా వ్యవహరించలేదు. వాళ్లు ఆ ప్రయత్నం చేసినప్పుడల్లా లాఠీచార్జీలు జరిగాయి. రిజర్వేషన్ వ్యతిరేక వుద్యమ విషయంలో మాత్రం శాంతియుతంగా వ్యవహరించమని ఎన్టీ ఆర్ హింసాకాండకు అలవాటు పడ్డ తన పోలీసులను ఆజ్ఞాపించాడు. వాళ్లు-చివరిరోజులలో జరిగిన ఒకటిరెండు సంఘటనలను మినహాయిస్తే ఆ ఆజ్ఞను పాటించారు.

ఈ రిజర్వేషన్ వ్యతిరేక వుద్యమాల నేపథ్యం ఏమిటి ?

షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు తెగలకు, సామాజికంగానూ విద్యారంగంలోనూ వెనుక బడిన వర్గాలకూ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ పరమయిన బాధ్యత. అధికరణం 15, అధికరణం 16ల లోని 4వ క్లాజులు విద్యావుద్యోగ రంగాలలో ప్రత్యేక సౌకర్యాలు కలిగించడానికి అవకాశం కల్పిస్తాయి. రాజ్యాంగంలోని 16వ అధ్యాయం, షెడ్యూల్డు కులాలు షెడ్యూల్డు తెగల కోసం ఒక ప్రత్యేక అధికారిని రాష్ట్రపతి నియమించే సదుపాయం కలిగిస్తాయి. షెడ్యూల్డు ప్రాంతాలలో పరిపాలనా నిర్వహణ గురించి నివేదిక సమర్పించడానికి 10 సంవత్సరాలకు ఒకసారి ఒక కమిషన్‌ను నియమించే బాధ్యత గూడ రాష్ట్రపతిదే. గవర్నర్లతో సంప్రదించి రాష్ట్రపతి ఏయే కులాలను తెగలను షెడ్యూల్డు కులాలగా తెగలగా పరిగణించాలో నిర్ణయిస్తాడు.

వెనుకబడ్డ వర్గాల మాటకొచ్చేసరికి స్పష్టమయిన నియమాలు పెట్టలేదు. రాష్ట్రపతి వాళ్లగురించి కమిషన్ వేయవచ్చును. కాని అది రాష్ట్రపతి యొక్క ప్రత్యేక బాధ్యతకాదు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు గూడ వెనుక బడ్డ వర్గాల కోసం ప్రత్యేక రాయితీలు కల్పించే అధికారం వుంది. సామాజికంగానూ విద్యారంగంలోను వెమకబడ్డ వర్గాలంటే ఏవో రాజ్యాంగం నిర్వచించలేదు. ఈ కారణంగానే రాజ్యాంగానికి అధికారిక వ్యాఖ్యాతలయిన కోర్టుల ప్రమేయం ఏర్పడింది.

మనరాష్ట్రంలో ప్రభుత్వం 1968లో అం.ప్ర. వెనుకబడ్డ వర్గాల కమిషన్‌ను నియమించింది. దీని అధ్యక్షుడయిన అనంతరామన్ తన నివేదికను 20-6-1970 నాడు సమర్పించాడు. అనంతరామన్ కమిషన్ మనరాష్ట్రంలో వెనుకబడిన కులాల జనాభా 32.7 శాతం వుందని తీర్మానించాడు. 1921, 1931 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని కమిషన్ ఈ సంఖ్యను నిర్ణయించింది. 1931 తరువాత కులంప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీయలేదు. అయితే తాను ఇచ్చిన వెనుకబడ్డ కులాల జాబితా సంపూర్ణం కాదని, సమాచారం అసమగ్రం కావడం వల్ల చాలా కులాలను లెక్కలోకి తీసుకోవడం జరగలేదని, కమిషన్ అనింది. అంతేకాక, స్వాతంత్ర్యం అనంతరం వెనుకబడ్డ కులాలగా లెక్కించబడుతున్న సంచార 'నేరస్తుల' తెగలను కమిషన్ లెక్కలోకి తీసుకోలేదు. ఈ నివేదికను ఆధారం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడ్డ వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ జీ.వో జారీ చేసింది. దానిని హైకోర్టులో ఛాలెంజి చేయగా హైకోర్టు కొట్టేసింది. అయితే సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పును తిరగదోడి జి. వో. ను రాజ్యాంగబద్ధమని ప్రకటించింది. ఈ విధంగా వెనుకబడ్డ వర్గాలకు రిజర్వేషన్లు వచ్చాయి.

10 సంవత్సరాల అనంతరం రిజర్వేషన్ల అమలును పునఃపరిశీలించవలసి ఉండింది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 22-1-82 నాడు మురళీధరరావు కమిషన్‌ను నియమించింది. రిజర్వేషన్ల అమలును సమీక్షించి వెనుకబడ్డ కులాలు ఏపాటి సామాజిక వైజ్ఞానిక ప్రగతిని సాధించాయో పరిశీలించడం, అల్ప సంఖ్యాక మతాలయొక్క సామాజిక విద్యావిషయమయిన వెనుకబాటుతనాన్ని పరిశీలించి వాళ్ళను వెనుకబడ్డ వర్గాలలో చేర్చవలసి ఉందేమో చూడడం, ఈ కమిషన్‌కు నిర్దేశించిన ఉద్దేశ్యాలు కమిషన్ తన నివేదికను 25-9-82 నాడు సమర్పించింది. దాని అతీగతీ ఎవ్వరూ పట్టించుకోలేదు- ప్రభుత్వంతో సహా.

ఇంతలో కాంగ్రెస్ అధికారం నుండి పోవడం, ఎన్టీ ఆర్ అధికారంలోకి రావడం, అతన్ని ఎట్లాగయినా తిరిగి కూలదోయడానికి కాంగ్రెస్ వాళ్లు నానాపాట్లు పడడం, జరిగాయి. అందులో భాగంగా కేంద్ర మంత్రి శివశంకర్ ఆధ్వర్యంలో తిరుపతిలో వెనుకబడిన వర్గాల సమావేశం జరిగింది. ఎన్టీ ఆర్ గాభరాగా మురళీధరరావు నివేదికను బయటకు తీసి నాలుగేళ్ళ దుమ్ముదులిపి అసెంబ్లీముందు పెట్టి నివేదికను అమలుచేస్తూ జివోలు జారీ చేసాడు. ఈ నిర్ణయం ఫలితంగా వెనుకబడ్డ వర్గాల రిజర్వేషన్లు 25 నుండి 44 శాతానికి పెరిగి, మొత్తం రిజర్వేషన్లు 72 శాతం చేరుకున్నాయి. ఈ నిర్ణయం జూలై 4వ పత్రికలలో ప్రచురించబడింది. అగ్రవర్ణాలు వెంటనే రెండు రంగాలలో జివోను వ్యతిరేకిస్తూ ఉద్యమం తీసారు- ఒకటి కోర్టులో, ఒకటి కోర్టు బయట.

వాళ్ళు వెనుకబడ్డ వర్గాలకు ఇచ్చిన 44 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగానికి వ్యతిరేకమని ప్రశ్నించారు. ప్రభుత్వం జివోను జారీ చేయడం దురుద్దేశ్యంతో కూడుకున్న చర్య అని, రాష్ట్ర జనాభాలో వెనుకబడిన వర్గాలు 52 శాతం ఉన్నారని మురళీధరరావు కమిషన్ వేసిన అంచనా సరయింది కాదని, 'బాలాజీ కేసు' (బాలాజీ వెర్సస్ స్టేట్ ఆఫ్ మైసూర్)లో సుప్రీం కోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించి వుండడం సరయింది కాదని తీర్పు యిచ్చిందని, వాదించారు. జనాభా లెక్కల గురించి తాము ఇచ్చిన వాదనను సమర్థించేందుకు 1921, 1931 జనాభాలెక్కలను తమకు అనుకూలంగా వ్యాఖ్యానించుకున్నారు. 'కాపు' అని పేరున్న అన్ని కులాలను అగ్రవర్ణాలగా లెక్కించి తద్వారా వెనుకబడ్డ వర్గాల జనాభాను తగ్గించారు.

'బాలాజీ కేసు'లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీం కోర్టు వెలిబుచ్చిన అభిప్రాయం కేవలం సూచనేనని తరువాత కొంత మంది జడ్జీలు అభిప్రాయపడినప్పటికీ ఆ తీర్పు ఇప్పటిదాకా శిరోధార్యంగానే వుండిపోయింది. మన రాష్ట్రహైకోర్టు గూడ అవిధంగానే భావించి మొత్తం రిజర్వేషన్లు 72 శాతం అయినాయని అభ్యంతరం తెలిపి జివోను కొట్టేసింది. అంతేకాక జనాభా లెక్కల విషయంలో గూడ అగ్రవర్ణాల వాదనతో హైకోర్టు అంగీకరించింది. కులంప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీయకపోవడం వల్ల ఏ కులం వాళ్లు ఎంత మంది ఉన్నారో తెలియని పరిస్థితిలో, కులం ప్రాతిపదిక మీద వెంటనే జనాభా లెక్కలు సేకరించమని ప్రభుత్వాన్ని ఆదేశించవలసిందిపోయి, హైకోర్టు తనంతట తాను నిరాధారమయిన 'అంచనా' తయారు చేసింది.

నిజానికి మొత్తం రిజర్వేషన్ల వ్యవహారంలో, అధికరణం 15 (4), 16 (4)లలోని ప్రత్యేక సౌకర్యాలను అమలు చేయాల్సిన బాధ్యత వున్న ప్రభుత్వ అంగాలు ఒక్కొక్కటీ ఏ విధంగా తమ

విధిని నిర్వహిస్తున్నాయో చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రభుత్వం కులం ప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీయదు. కోర్టులు వెనుకబాటుతనానికి కులం ఒక్కటే ప్రమాణం కాజాలదని అంటాయిగాని సరయిన ప్రమాణం ఏమిటో చెప్పవు. నిజానికి సామాజిక విద్యారంగాలలో వెనుకబాటు తనాన్ని గుర్తించడానికి ప్రమాణాలను నెలకొల్పే ప్రయత్నం కోర్టులుగాని ప్రభుత్వంగాని చేయనేచేయవు. ఇక రిజర్వేషన్ల పరిమాణం మాటకొస్తే, మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించి వుండకూడదని బాలాజీకేసులో సుప్రీంకోర్టు తీర్మానిస్తుంది. అట్లాంటి పరిమితిపెట్టే అధికారం సుప్రీంకోర్టుకు ఎంత మాత్రంలేదు ఈవిధమయిన పరిమితి పెట్టడం రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడం అనిపించుకోదు. అధికరణం 15, 16లకు ఒక కొత్త క్లాజును చేర్చడం అవుతుంది. అది సుప్రీం కోర్టు చేయగలపనికాదు.

అసలు 50 శాతం అని నిర్ణయించడంలో సబబు ఏమిటి ? ఏరకమయిన విషయసేకరణ ఆధారంగా కోర్టు ఈ నిర్ణయానికి వచ్చింది ? షెడ్యూల్డు కులాలు షెడ్యూల్డు తెగల జనాభాను లెక్కించడం జరుగుతోంది కాబట్టి వాళ్ళ జనాభా పెరిగినప్పుడు ఆ విషయం తెలుస్తుంది. వాళ్ళ జనాభా ప్రస్తుతం 22 శాతం వుంది. అది 30 శాతానికి పెరిగితే అందుకు అనుగుణంగా వాళ్ళకు యిచ్చే రిజర్వేషన్లు సహితం పెరుగుతాయి. అప్పుడు మొత్తం రిజర్వేషన్లకు 50 శాతం పరిమితిపెడితే, వెనుకబడిన కులాల రిజర్వేషన్లు (వెనుకబాటుతనం ఎంత మాత్రం తగ్గక పోయినప్పటికీ) తగ్గిపోతాయి. దురదృష్టవశాత్తూ శాసనాలను రద్దు చేయవచ్చును గాని కోర్టు తీర్పులను ప్రజలు రద్దు చేయలేరు కోర్టులే పునఃపరిశీలించుకోవాలి. అవి చాలా నెమ్మదిగా గాని తమ అభిప్రాయాలను మార్చుకోవు తత్ఫలితంగా 50 శాతం పరిమితి అనేది గుదిబండలాగ ఉండి పోయింది.

చివరిగా, వెనుకబడ్డ కులాల జనాభా అంచనా వేసేటప్పుడు మరొక విషయాన్ని గూడ గుర్తుంచుకోవాలి. 1831 నుండి 1931 దాకా బ్రిటిష్ వలస ప్రభుత్వం కులం ప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీసింది. అయితే అప్పటి సెన్సస్ రిపోర్టులను చదివితే కనబడే విషయం ఏమిటంటే చాలా తరచుగా నిమ్న కులాల వాళ్ళు తమది అగ్రవర్ణంగా చెప్పుకోవడం. అప్పటికి రిజర్వేషన్లు లేవు కాబట్టి వెనుకబడ్డ కులంగా చెప్పుకోవడం వల్ల ప్రయోజనం లేదు. అగ్రవర్ణంగా చెప్పుకుంటే సామాజికంగా 'ప్రెస్టీజ్' పెరుగుతుంది. వుదాహరణకు బెంగాల్‌లోని తేలీలు (నూనెతీసే కులం) తమనుతాము వైశ్యులుగా చెప్పుకునేవారంట. కూర్మీ అనే వ్యవసాయ కులస్తులు క్షత్రియులం అని చెప్పుకునేవారంట. దీన్ని సమర్థిస్తూ పురాణాల నుండి కథలు వుటంకించేవారంట. అయితే వీళ్ళ వర్ణ అధిరోహణాన్ని బ్రాహ్మణ క్షత్రియ వైశ్యకులస్తులు వ్యతిరేకిస్తూ గొడవ చేసే వాళ్ళంట. ఈ వివాదం పిటిషన్ల రూపంలో సెన్సస్ అధికార్లను ముంచెత్తిందంట. ఒక సంవత్సరం సెన్సస్ అధికార్లకు చేరిన పిటిషన్లను తూకం వేస్తే 50 కేజీలు తూగాయట ! దీని ఫలితంగా, కులం ప్రాతిపదిక మీద జనాభా లెక్కలు తీస్తే ప్రయోజనం లేదనిపించి బ్రిటిష్ పాలకులు 1931 తరువాత మానుకున్నారు. కాబట్టి 1921, 1931 లెక్కలను ఆధారం చేసుకొని వాదించేటప్పుడు అవి పూర్తిగా విశ్వసనీయం కాదని, అగ్రవర్ణాల జనాభా ఎక్కువగా అంచనా వేయబడి వుంటుందని, గుర్తించడం అవసరం.

## వ్యాసం

# వాతావరణ కాలుష్యం

పుట్టిన ప్రతిమనిషికి స్వత: సిద్ధంగా జీవించే హక్కు ఉంది. ఈ హక్కునే ప్రజాస్వామ్య యుగంలో ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగంలో పొందు పర్చాయి. భారత రాజ్యాంగం కూడా జీవించే హక్కును గుర్తించింది. ప్రాథమిక హక్కుల అధ్యాయంలోని ఆర్టికల్ 21 ప్రకారం "ఎవ్వరి ప్రాణాన్ని గాని స్వేచ్ఛను గాని చట్ట సమ్మతమయిన పద్ధతిలో తప్ప ఇతరత్రా తీసివేయడానికి వీలులేదు."

చట్ట సమ్మతమైన పద్ధతులలో కూడా ప్రాణం తీసివేయడం అమానుషమేనని ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులు వాదిస్తుండగా మరొకవైపు మనదేశంలో వివిధ రూపాల్లో ఈ హక్కుపై వ్యవస్థాగతమైన దాడి సాగుతున్నది. మనదేశంలో మనిషి ప్రాణమే అన్నిటి కన్న చవక అని చెప్పడం అతిశయోక్తి కాదు.

పోలీసు లాకప్పుల్లో ఇంటరాగేషన్ పేర చిత్రహింసలు పెట్టి చంపడం, ఎన్‌కౌంటర్ల పేర కాల్చిచంపడం, హరిజనులపై కారంచేడు పక్కిలో జరిగేదాడులు జీవించే హక్కుపై సాగుతున్న దాడికి మచ్చుతునకలు. ఇంత ప్రాచుర్యం పొందని మరో రూపంలో కూడా జీవించే హక్కుపై దాడి జరుగుతున్నది. ఫ్యాక్టరీ యజమానులు సేఫ్టీ, కాలుష్య నివారణ నిబంధనలను ఉల్లంఘించడం ద్వార ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుల, ఇరుగుపొరుగున నివసించే ప్రజలప్రాణానికి ముప్పు కలిగిస్తున్నారు. భోపాల్ గ్యాస్‌లీక్ తర్వాత ఈ విషయాన్ని చాలామంది గుర్తించారు.

సేఫ్టీ, కాలుష్యనివారణ నిబంధనలను ఉల్లంఘించడం వలన విషపూరితమైన రసాయనాలు వెలువడి పరిసరాలలోని గాలిని, నీటిని, భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి. కలుషితమైన గాలి, నీరు మనిషి ప్రాణానికి ప్రమాదాన్ని సృష్టిస్తాయి. దాదాపు పరిశ్రమలున్న అన్ని ప్రాంతాలలోను ఈ పరిస్థితి ఉన్నది. విస్తృతంగా పరిశ్రమలున్న హైదరాబాద్‌లో వాతావరణ కాలుష్యం ఎక్కువ స్థాయిలో ఉన్నది.

ఆంధ్రప్రదేశ్‌లో 1970-80 మధ్యకాలంలో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. 1956లో మొత్తం చిన్న తరహా పరిశ్రమలు 896 వుండగా 1972 నాటికి ఇవి 8090 కి పెరిగాయి. 1983 చివరినాటికి రాష్ట్రంలోని మొత్తం చిన్నతరహా పరిశ్రమల సంఖ్య 42,063. ఇకపోతే మొత్తం పెద్ద పరిశ్రమలు 1972లో 177 వుండగా 1983 మార్చినాటికి 388 పెద్ద పరిశ్రమలున్నాయి. పారిశ్రామికాభివృద్ధి ఎక్కువ భాగం హైదరాబాద్ చుట్టు పక్కల